క్లుప్తంగా

పేదలకు అన్నదానం



పేదలకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న జిల్లెల్లమూడి సేవా సమితి సభ్యులు

మద్దిలపాలెం : జిల్లెల్లమూడి అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. మద్దిలపాలెంతో పాటు, ఈఎస్‌టీ ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు పోలా ఉమహేశ్వరరావు, ఎం.ఉమామహేశ్వరరావు, కె.ఆదినారాయణ, దత్తి వెంకటరమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్(కాకినాడ) సమావేశం డిసెంబర్ 3న జరగనుంది. ఈ మేరకు సన్నాహక సమావేశం ఆదివారం ఎంవీపీ కాలనీలో జరిగింది. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం వేదికగా ఈ సమావేశం నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూకేలో విద్యనభ్యసించి ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సన్నాహక సమావేశంలో అసోసియేసన్ ప్రతినిధులు ప్రసాద్, ఓఆర్ఎం రావు, పిల్లి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేజీ వీడ్ ఆయిల్ స్వాధీనం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వీడ్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. వారికి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం టాస్క్ ఫోర్స్, ఫిఫ్త్ టౌన్ పోలీసులు కలసి నిర్వహించిన దాడుల్లో తిక్కవానిపాలెం వద్ద ఓ ఇంట్లో వీడ్ ఆయిల్‌ను విక్రయించడానికి సిద్ధంగా ఉన్న బద్నాని రామారావు, వి.సోమలింగం, కొర్ర సత్తిబాబు అనే ముగ్గురు వ్యక్తులు అరకు, మాడుగుల నుంచి వీడ్ ఆయిల్‌ను తీసుకొచ్చి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న క్రమంలో పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి ఒక కేజీ వీడ్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం పోలీసులు తెలిపారు.

అప్పన్నకు నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న గ్రీవెన్స్‌లో నగర ప్రజలు తమ సమస్యలు వినతిపత్రం ద్వారా అందజేయవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, హార్టికల్చర్, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు చేయవచ్చు.

వైవిధ్యం.. విశిష్టం.!

నీరు ఎక్కడ ఉంటే అక్కడ ఆహ్లాదం వెల్లివిరుస్తుంది. పల్లెకైనా, నగరానికైనా నీటి వనరులు ఎంతో అవసరం. అభివృద్ధి విస్తరణకు కూడా నీరే ప్రధానం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి అవసరం ఉంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా తమ అవసరాలకు అనుగుణంగా నీటి వసతులను సమకూర్చుకుంటోంది. మరో వైపు పర్యావరణాన్ని, ప్రకృతిని సంరక్షిస్తూ సమాజానికి ఆదర్శనంగా నిలుస్తోంది. ఈ దిశగా నవ్య ప్రాజెక్టులను రూపకల్పనచేసి చూపుతోంది. ఇతర విశ్వవిద్యాలయాలకు భిన్నంగా పలు వైవిధ్యమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ తన విశిష్టతను చాటుకుంటోంది. ఇటీవల కాలంలో ఏయూ చేపట్టిన నాలుగు అంశాలు ఎంతో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. –ఏయూ క్యాంపస్

- వినూత్న ప్రాజెక్టులకు ఏయూ శ్రీకారం
- నీటి సంరక్షణకు ప్రత్యేకంగా చెరువు నిర్మాణం
- ఇంకుడు గుంతలు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం ఏర్పాటు
- ప్రత్యేక వాహనంతో కాలుష్య అధ్యయనం



నూతనంగా నిర్మించిన చెరువు

నీటి సంరక్షణకు చెరువు

ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తూ కొత్త చెరువును ప్రత్యేకంగా తవ్వించారు. నూతనంగా నిర్మించిన అల్గారిదం భవనానికి ఆనుకుని దీనిని అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ రాతితో గట్టును సైతం నిర్మించారు. గట్టుపై విద్యార్థులు కూర్చుని సేదతీరడానికి ఉపయుక్తంగా సిమెంట్ బెంచీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ కొబ్బరి మొక్కలు నాటి సంరక్షణ చర్యలు ప్రారంభించారు. వర్షా కాలంలో భవనాలపై పడే నీరు, ఇతర మార్గాల్లో వచ్చే నీటిని దీనిలోకి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో వర్షాలు కురిసే సమయంలో దీనిలో పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండేలా ఈ చెరువును నిర్మించారు. సమీప ప్రాంతాల వారికి నీటి కొరత రాకుండా, భూగర్భ జలాలు పెరిగేలా ఈ చెరువు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నిర్మించిన సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం

వర్సిటీలో ఉన్న చెట్ల నుంచి నిత్యం రాలే ఆకులను ఎరువుగా మార్చడానికి ప్రత్యేకంగా సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏయూ శానిటేషన్ డీన్ కార్యాలయం చేరువలో దీనిని నిర్మించారు. నిత్యం వర్సిటీ పరిసరాల్లో రాలే ఆకులు, ఎండిన చెట్ల వ్యర్థాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంపోస్ట్ తయారీ పిట్‌లలో వేసి ఎరువుగా మార్చుతారు. ఈ సేంద్రియ ఎరువును ఏయూలో నిర్వహిస్తున్న నర్సరీలో మొక్కలు పెంపకానికి వినియోగించనున్నారు.

కాలుష్య అధ్యయన వాహనం



పొల్యూషన్ మానిటరింగ్ వాహనంలో పరికరాలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం మీటిరాలజీ, ఓషనోగ్రఫీ విభాగానికి నూతనంగా డీఎస్‌టీ నిధులతో మొబైల్ ఎయిర్ పొల్యూషన్ మోనిటరింగ్ ఫెసిలిటీని అందుబాటులోకి వచ్చింది. డీఎస్‌టీ ఫిస్ట్ పథకంలో భాగంగా రూ.50 లక్షలతో దీనిని సమకూర్చారు. నగరంలోని విభిన్న ప్రాంతాలలో వాయు కాలుష్యాన్ని గణించడానికి అవసరమైన ఉపకరణాలు ఈ వాహనంలో ఉన్నాయి. విభాగ విద్యార్థులు, పరిశోధకులు విశాఖ నగరంలోని నిర్దిష్ట ప్రాంతాలకు ఈ మొబైల్ వాహనాన్ని తీసుకువెళ్లి వాయు కాలుష్యాన్ని గుర్తించడానికి, సేకరించిన సమాచారం ఆధారంగా విశ్లేషించడం, ఖచ్చితమైన ఫలితాలను అందించడం చేస్తారు.

భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు

వర్సిటీలో ఉన్న భవనాల చుట్టూ ఇంకుడు గుంతలు తవ్వారు. భవనాలపై నుంచి పడే వర్షపు నీటిని ఈ గుంతల్లోకి మళ్లించి భూగర్భ జలాలను పెంచే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. వర్సిటీ పరిసరాలలో పుష్కలంగా భూగర్భ జలాలు ఉండేలా ఈ గుంతలు దోహదపడనున్నాయి. ఫలితంగా వర్సిటీ చుట్టూ ఉన్న ఐదారు కిలోమీటర్ల విస్తీర్ణంలో ప్రాంతాలకు సైతం నీటి కొరత రాకుండా, భూగర్భ జలాల శాతం పెరగడానికి ఉపయుక్తంగా నిలవనున్నాయి.



ఏయూలో నిర్మించిన ఇంకుడు గుంత

తొలగించిన కులాలను బీసీ జాబితాలో చేర్చాలని వినతి

ఎంవీపీ కాలనీ: తెలంగాణ ప్రభుత్వం బీసీ జాబితా నుంచి గతంలో తొలగించిన కులాలను తిరిగి చేర్చాలని రాష్ట్ర బీసీ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు ఆదివారం తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వి.కృష్ణమోహన్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ మాట్లాడుతూ 2014లో తెలంగాణ ప్రభుత్వం 26 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిందన్నారు. కేంద్ర బీసీ కమిషన్ అనుమతి లేకుండా తొలగింపులు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ తొలగింపు కారణంగా ఏపీ నుంచి వెళ్లి హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు నగరాల్లో స్థిరపడిన బీసీ కులాల వారికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో వారిని తిరిగి బీసీ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్యాంసుందర్, డాక్టర్ వెంకట్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర బీసీ సంఘం సభ్యులు

రెడ్‌క్రాస్ వలంటీర్ల నమోదే లక్ష్యం

మహారాణిపేట: మిలియన్ వైఆర్‌సీ (యంగ్ రెడ్ క్రాస్) వలంటీర్ల నమోదే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ, సీఈవో ఎ.కె.ఫరీదా తెలిపారు. ఆదివారం విశాఖ రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను ఇంకా విస్తృత పరుస్తున్నామన్నారు. విద్యార్థులు, వలంటీర్లను పెద్ద సంఖ్యలో చేర్చుకుని వారి ద్వారా పేదలకు వివిధ రకాల సేవలందించాలని నిర్ణయించామన్నారు. వీరిందరికీ ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించి రెడ్‌క్రాస్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎక్కువగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జగన్మోహనరావు, విశాఖ జిల్లా చైర్మన్ వై.శివనాగేంద్ర రెడ్డి, కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, ప్రతినిధులు రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సీఈవో ఫరీదా, చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

సామాజిక భవన సమస్యకు పరిష్కారం చూపండి

గవర్నర్‌ను కోరిన బ్రాహ్మణులు

మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో బ్రాహ్మణ సామాజిక వర్గ ప్రతినిధులు ఆదివారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బ్రాహ్మణ సామాజిక భవనం కోసం మాధవధారలో 0.22సెంట్ల స్థలాన్ని మంజూరు చేశారని.. నేటికీ ఆ స్థలాన్ని అందజేయలేదన్నారు.
దీనిపై చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గవర్నర్‌ను అభ్యర్థించారు. జిల్లా బ్రాహ్మణ సామాజిక వర్గ ప్రతినిధులు టి.ఎస్.ఆర్.ప్రసాద్, సూరంపూడి వీరభద్రరావు, కె.చరణ్, గణేష్ వంగూరి, వడ్డాది ఉదయ్ కుమార్, తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

ఏఎస్ఐపై దాడి కేసులో వ్యక్తి కోసం గాలింపు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐపై దాడికి పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌లో ఈ నెల 25న దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమంలో కొంత మంది మద్యం తాగి ఏఎస్ఐ శివకృ... ష్ణ విధులకు ఆటంకం కలిగించి దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో వెంకట సూర్యనారాయణ కోసం గాలిస్తున్నారు. విజయవాడలో అతడు ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి పయనమైనట్లు సమాచారం.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని లంకెపాలెం వద్ద కదులుతున్న రైలు నుంచి జారి పడిన వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం పది గంటల సమయంలో లంకెలపాలెం సమీపంలో కదులుతున్న రైలు నుంచి జారిపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు, నీలి రంగు టీషర్ట్, నలుపురంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నట్టు వారు తెలిపారు. వివరాల కోసం దువ్వాడ రైల్వేస్టేషన్‌లోని ఔట్‌పోస్ట్‌లో సంప్రదించాలని కోరారు.



ట్రాక్‌పై మృతదేహం

ఆరోగ్య సమస్యలపై అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు: ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా క్లిష్టమైన ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రామ్‌నగర్ నుంచి పాత జైల్ రోడ్డు వరకు సాగిన ఈ ర్యాలీలో ధూమపానం, మద్యపానం హానికరమంటూ నినాదాలు చేశారు. మెదడకు రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు స్ట్రోక్ సంభవిస్తుందని డాక్టర్లు వివరించారు.

తెరచుకున్న ఆలయాలు



సంప్రోక్షణ అనంతరం విశేష అలంకరణలో బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి.

అల్లిపురం : చంద్రగ్రహణం సందర్భంగా శనివారం రాత్రి నుంచి దేవాలయాలు మూసివేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నియోజకవర్గంలో ఇసుక కొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమాసహిత సత్యనారాయణ స్వామి, అంబికాబాగ్‌లో కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయం, టౌన్‌కొత్తరోడ్డులో గల జగన్నాథస్వామి దేవస్థానం, పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ ఆలయం, ఆంజనేయస్వామి దేవస్థానం, పోర్టు వేంకటేశ్వరస్వామి దేవస్థానం, బాబా ఆలయాలు, రామాలయం, అల్లిపురం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాంగార్డెన్స్‌లోని శ్రీ నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో గల శ్రీ భవానీ శంకర దేవాలయాల్లో ఆదివారం ఉదయం సంప్రోక్షణ చేపట్టారు. ములవిరాట్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం, విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు.

హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం

సీతమ్మధార : కార్మిక వర్గం హక్కుల సాధనకు పోరాడాలని రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేటు వద్ద ఆటోస్టాండ్‌లో ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ప్రజా సమస్యలపై ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. ఆటోలపై జరిమానాలు పెంచే జీవో 21,31లను రద్దు చేయాలన్నారు. మంగళవారం ఉదయం10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగే ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రవికృష్ణ, శ్రీను, ఎల్లాజీ, పి.రాజు, మూర్తి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ద్వారకానగర్ ఆటోస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

విద్యా సమాచారమ్

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నాక్ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీలో జరుగుతున్న పనుల ప్రగతిపై రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం సమీక్షించారు. వివిధ విభాగాల అధికారులతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రానున్న రెండు రోజుల్లో జరగాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. నాక్ కమిటీ పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు చేపడుతున్న అధికారులు ఆదివారం సైతం పూర్తి స్థాయిలో పని చేశారు. అన్ని విభాగాలను భాగస్వామ్యం చేస్తూ సమన్వయంతో పని చేయాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.రమాసుధ, ఆచార్య ఎ.కె.ఎం.పవన్, ఆచార్య విజయమోహన్, ఎస్.ఎం.యుగంధర్, ఎస్.హరనాథ్, కె.సీతామాణిక్యం, సాల్మన్ బెన్నీ, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఉద్యమంలా స్వచ్ఛభారత్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోంది. ఏయూ విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, విద్యార్థులు, సిబ్బంది భాగస్వాములు అవుతూ నిత్యం వర్సిటీలో ఒక ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాలలో ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్, రంజని గెస్ట్‌హౌస్ ప్రాంగణాలలో శ్రమదానం చేశారు. సిబ్బందితో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్, వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దే దిశగా పని చేస్తామని షారోన్‌రాజు తెలిపారు.



ఉద్యోగులతో కలసి వ్యర్థాలు తొలగిస్తున్న డాక్టర్ షారోన్ రాజు

సందడిగా ఓపెన్ జిమ్‌లు



ఆరిలోవ కాలనీ వద్ద జిమ్‌లో పిల్లలు



ముడసర్లోవ స్కిల్ డెవలప్‌మెంట్ వద్ద ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న మహిళలు

ఆరిలోవ: బహిరంగ ప్రదేశాలలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిత్యం సందడిగా కనిపిస్తున్నాయి. మహిళలు ఎక్కువగా ఈ జిమ్‌లను వినియోగించుకుంటున్నారు. జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల పరిధిలో విశాలాక్షినగర్ నుంచి ఆరిలోవ కాలనీ వరకు జీవీఎంసీ అధికారులు 8 చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో చోట సుమారు రూ.3 లక్షలు విలువ చేసే వివిధ వ్యాయామ పరికరాలు అమర్చారు. వీటిలో ముడసర్లోవ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన జిమ్‌లో పరికరాల వద్ద ఎక్కువ మంది మహిళలు కుస్తీ పడుతున్నారు. ఈ ప్రాంతంలో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉదయం, సాయంత్రం సమయాలలో నడక కోసం వందలాది జనం వస్తుంటారు. వారిలో ఎక్కువ మంది మహిళలు ఈ జిమ్‌లో వ్యాయామం చేస్తున్నారు. తోటగరువు హైస్కూల్, వివేకానందనగర్ పార్కు, పెదగదిలి, ఆరిలోవ కాలనీలలో ఏర్పాటు చేసిన జిమ్‌లలో పిల్లల సందడి ఎక్కువగా ఉంటోంది.

మృతుడి తరఫు సాక్షిపై దాడి

ఎంవీపీ కాలనీ: గతంలో జరిగిన కొట్లాటలో మృతుడి తరపున సాక్ష్యం చెప్పిన వ్యక్తిపై నిందితుల తరపు వ్యక్తులు దాడి చేసిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఆగస్టు 15న రాత్రి సమయంలో మద్దిలపాలెం చేపల బజార్ వద్ద పెయింటింగ్ పనులు చేసుకునే నారాయణరావుకు మరికొందరికి మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో నారాయణరావు మద్యం మత్తులో బోర్లా పడి మరణించాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా ఈ కేసులో సాక్షిగా ఉన్న వ్యక్తిపై నిందితుల తరపు వారు ఆదివారం దాడి చేశారు. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ విషయంపై గతంలో మృతి చెందిన నారాయణరావు సోదరుడు అప్పలరాజు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ మల్లేశ్వరరావు దాడి చేసిన వారిని పిలిపించి మందలించినట్లు సమాచారం. అయితే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.



దాడిలో గాయపడిన ప్రధాన సాక్షి

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా నిత్యం ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు.

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొంత మంది రౌడీషీటర్లు గొడవలు సృష్టిస్తున్నారని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు.

మంచి చిత్రాలను ఆదరించాలి

సీతంపేట: ఇటీవల విడుదలైన మార్టిన్ లూథర్ కింగ్ సినిమాపై సమీక్ష, చిత్రంలో నటించిన విశాఖ కళాకారులకు సత్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ, హాస్యప్రియ కామెడీ క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా కామెడీ క్లబ్ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చెబుతూనే, సమాజంలో అసమానతలను ఎత్తిచూపుతూ ఆలోచింపజేసే చిత్రం మార్టిన్ లూథర్ కింగ్ అని పేర్కొన్నారు. ఇటువంటి మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్రంలో నటించిన విశాఖ కళాకారులు ఇమంది ఈశ్వరరావు, కె.సి.హెచ్.గోపినాయుడు, ఎస్.కె.మదీన(మల్లిక)లను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో లీడర్ సంపాదకులు వి.వి.రమణమూర్తి, కాశీవిశ్వేశ్వరరావు, చిన్నారావు, త్రినాథరావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



విశాఖ కళాకారులను సత్కరిస్తున్న అతిథులు